ఓటు హక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 8 : ఓటు ఎంతో విలువైనదని, అర్హులందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి కోర్టు సెంటర్ వరకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నీతి, నిజాయితీగా పనిచేసే నాయకుడిని ఎన్నుకునేందుకే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓటును నోటుకు అమ్ముకోవద్దని సూచించారు. మంచి విజన్ ఉన్న నాయకుడిని గెలిపిస్తే సమాజానికి, దేశానికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లే అవుట్‌ను పరిశీలించిన కలెక్టర్

డోర్నకల్ : డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రంక్ తండా సమీపంలో ఉన్న లే అవుట్‌ను కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం పరిశీలించారు. ట్రంక్ తండా సమీపంలో ఉన్న లే అవుట్‌లో సర్వే నంబర్ 60లోని 3ఎకరాల 30 గుంటలు భూమిలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన ఎన్‌వోసీ ప్రకారం లే అవుట్ ఉండాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ డేవిడ్, మున్సిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, టీపీఎస్ రమేశ్, సర్వేయర్ వెంకట్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ పాల్గొన్నారు.

డోర్నకల్ : ట్రంక్‌తండాలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు

- జూన్ 4న ఎన్నికల ఫలితాల వెల్లడి
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కింపు
- ఈవీఎంల భద్రతకోసం ప్రత్యేక గదులు
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం

గురుకుల పాఠశాల

మహబూబాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఇందుకు ఎంచుకున్నారు. పార్లమెంట్ పరిధిలో ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈవీఎంలను జిల్లా కేంద్రానికి తరలించనున్నారు. మే13న పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ పూర్తికాగానే ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ను తీసుకొచ్చి అసెంబీ నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచనున్నారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్‌కు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్ ప్రత్యేక దృష్టిసారించారు. లెక్కింపు కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలో ముఖ్యంగా విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, ఇతర వసతులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ భద్రతతోపాటు అన్ని మౌలిక సౌకర్యాలు, పార్కింగ్‌కు అనువైన స్థలం ఉంది. 2019 ఎన్నికల్లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కూడా ఇక్కడే నిర్వహించారు. మే 13న పోలింగ్ తర్వాత జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకర్గంలోని మొత్తం 1,783 పోలింగ్ కేంద్రాలకు 2,300 బ్యాలెట్ యూనిట్లు, 2300 కంట్రోల్ యూనిట్లు, 3వేల వీవీ ప్యాట్లు కేటాయించారు. ఎన్నికలకు ఒక్క రోజు ముందు మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఈవీఎంలను తీసుకొని ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు. ఎన్నికల అనంతరం జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలకు ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను తరలించనున్నారు.

ఫలితాల కోసం 21 రోజులు ఆగాల్సిందే..

మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం మార్చి 16న ప్రకటించింది. అప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, 25వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు సమయం ఉంది. మే 13న ఎన్నికలు నిర్వహిస్తారు. అప్పటి నుంచి జూన్ 4 వరకు 21రోజులు ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూడాల్సిందే. పోలింగ్ పూర్తయిన తర్వాత నుంచి కౌంటింగ్ వరకు 21 రోజుల పాటు ఈవీఎం, వీవీప్యాట్లను జాగ్రత్తగా భద్రపరచాల్సి ఉంటుంది. ఈవీఎంల భద్రత దృష్ట్యా స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మే 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే అదే రోజు రాత్రి వరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వచ్చిన ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈవీఎంలను భద్రపరుస్తారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కోసం ఏడు స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కోసం మరో ఏడు గదులను సిద్ధం చేశారు.

అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఐపీఎస్ చేతన్‌నితిన్

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

బయ్యారం, ఏప్రిల్ 8: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ట్రైనీ ఐపీఎస్ చేతన్‌నితిన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మత పెద్దలు, ఆలయ కమిటీల సభ్యులతో ఆయన మాట్లాడుతూ.. ఉగాది, రంజాన్ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సోషల్ మీడియాలో సైతం మతవిద్వేషాలు రేకెత్తేలా పోస్టులు పెట్టొద్దన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతి వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆందోళన

ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 8 : వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిన ఘటన పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో సోమవారం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం రాగబోయినగూడేనికి చెందిన చెందిన కున్‌సోత్ కల్యాణి (25) ఇంటి వద్దనే ప్రసవించింది. మగ బిడ్డకు పుట్టిన తర్వాత కడుపు నొప్పి, పిట్స్ రావటంతో పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తీసుకొచ్చారు. చికిత్స అందిస్తున్న క్రమంలో వైద్యుల నిర్లక్ష్యంతో కల్యాణి మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు దవాఖాన ఎదుట ఆందోళన చేపట్టారు. దవాఖానపై చర్యలు తీసుకొని కుటుంబానికి చేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలి

కేసముద్రం, ఏప్రిల్ 8 : విద్యార్థులు వ్యవసాయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కేవీకే మల్యాల శాస్త్రవేత్త భాస్కర్ సూచించారు. మండలంలోని కేసముద్రం స్టేషన్ హైస్కూల్‌కు చెందిన 215మంది విద్యార్థులు సోమవారం మల్యాల రీసెర్చ్ సెంటర్‌ను క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పంటల నూతన వంగడాలు, అంటుకట్టు విధానాన్ని విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం బందెల రాజు, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, కృష్ణవేణి, యాదగిరి, మదన్మోహన్, ముదిగిరి సదయ్య, సురేశ్, చందర్, లక్ష్మీకుమారి, శ్రీవిద్య పాల్గొన్నారు.

పశువుల సంతలో మౌలిక వసతులు కల్పించాలి

తొర్రూరు, ఏప్రిల్ 8 : పశువుల సంతలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ కోరారు. సోమవారం సంతలో పేరుకుపోయిన సమస్యలపై మున్సిపల్ పాలక మండలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకమండలి స్పందించి సంతలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్, మండల నాయకులు సాంబయ్య, రవి, స్వామి పాల్గొన్నారు.

ఫ్యూరిఫైడ్ వాటర్ డిస్పెన్సర్ వితరణ

పెద్దవంగర, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1998-1999 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.10 వేలు విలువ చేసే ఫ్యూరి ఫైడ్ వాటర్ డిస్పెన్సర్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీ శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలపై ప్రతి విద్యార్థి దాతృత్వం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రాజలింగం, సదయ్య, తాఖీ పాషా, అంజయ్య, యాకన్న, శ్రీధర్, గౌరీశంకర్, విజయ్‌కుమార్, హైమా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాదరక్షల అందజేత

నెల్లికుదురు, ఏప్రిల్ 8: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన కొండపల్లి గోపాల్‌రావు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం రూ.15వేల విలువైన పాదరక్షలను అందజేశారు. పాఠశాల హెచ్ఎం వెంకటేశ్, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, సాయిప్రసాద్, రంజాన్, అశోక్, యాకూబ్‌రెడ్డి, శ్రీధర్, మానస పాల్గొన్నారు.

ప్రజల దాహం తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

తొర్రూరు, ఏప్రిల్ 8 : ప్రజల దాహం తీర్చేందుకే చలివేం ద్రం ఏర్పాటు చేసినట్లు జన వికాస కో-ఆర్డినేటర్లు జే శైలజ, ఎం శోభారాణి తెలిపారు. మండలంలోని మడిపల్లిలో మాజీ ఉప సర్పంచ్ నల్గొరి రామలింగం ఆమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమా, జన వికాస మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరిపెడ: మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో సోమవారం బాల వికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైస్ ఎంపీపీ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల వికాస సిబ్బంది స్వర్ణలత, స్వరూప పాల్గొన్నారు.

రంజాన్ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

గార్ల, ఏప్రిల్ 8 : రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై జీనత్ కుమార్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి గొడలు జరగకుండా శాంతియుతంగా పండుగ జరుపుకోవాలన్నారు. షఫీ, గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

కేసముద్రం, ఏప్రిల్ 8: మండలంలోని నిరుపేద ముస్లింలకు తన తండ్రి గోరేమియా జ్ఞాపకార్థం సీఐడీ ఎస్సై ఖాజాహఫీజున్నీసా బేగం, అబ్దుల్ హమీద్ దంపతులు మండల కేంద్రంలోని మసీదులో సోమవారం రంజా న్ కిట్లను పంపిణీ చేశారు. వంద కుటుంబాలకు 8 రకాల వస్తువులను అందజేశారు. పేద ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు సీఐడీ ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షేక్ హాషం, మహ్మద్ నవాజ్, అఖిల్, షబ్బీర్, మున్వార్, హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు

గార్ల, ఏప్రిల్ 8: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన గార్ల సరిహద్దు సత్యనారాయణపురం ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై కథనం ప్రకారం... సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బుచ్చి రాములు (58) కుటుంబ సభ్యులతో మహబూబాబాద్‌లో పెళ్లికి వెళ్తుండగా గార్ల సరిహద్దు ప్రాంతం సత్యనారాయణపురం వద్ద ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బుచ్చిరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని గార్ల ఎస్సై జీనత్‌కుమార్ పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఓటు వజ్రాయుధం లాటింది

డోర్నకల్, ఏప్రిల్ 8 : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం డోర్నకల్ రైల్వే స్టేషన్ నుంచి మసీదు సెంటర్ వరకు ఓటు నమోదు పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎంపీవో మీర్జా మున్వర్‌బేగ్, ఏపీఎం శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు అన్వర్ నరేశ్, నాగయ్య, నవీన్, సంపత్, సెర్ప్ సీసీ రాధ, మెప్మా పాల్గొన్నారు.

ప్రతి బావిని తాగునీటి కోసం వినియోగించుకోవాలి

మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్

పూడిక తీస్తున్న బావిని పరిశీలిస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 8 : నిరుపయోగంగా ఉన్న బావులకు మరమ్మతు చేసి, తాగునీటి కోసం వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన 20వ వార్డులోని మంగల్ కాలనీ, 6వ వార్డులోని బేతోల్ మాన్‌సింగ్ తండా, వెంకటేశ్వర్లుకుంట, హస్తినాపురం కాలనీలో బావుల పూడికతీత పనులను పరిశీలించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. గత వేసవిలో అందించిన విధంగానే ఈ ఏడాది కూడా తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు కృషి చేయాలని సూచించారు. వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్లు తాళ్లపల్లి జగన్, భూక్యా సునీతారవి, మార్నేని రఘు, డౌలాగర్ శంకర్, రాంజీ, సంతోశ్ పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రగతిశీల హమాలీ సంఘం నాయకుల డిమాండ్

మహబూబాబాద్, ఏప్రిల్ 8 : హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఏసీఎల్, ఏఎల్‌వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి మాట్లాడుతూ... నిత్యం బరువులు మేసే హమాలీలకు ఎలాంటి పని భద్రత లేదన్నారు. తీవ్ర ఇబ్బందిపడుతూ దుర్భరమైన జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీలకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఖరారు చేసి అందజేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, బోనస్, ప్రమాద బీమా, 50 ఏళ్లు పైబడిన వారికి నెలకు రూ.6వేల పింఛన్ అందించాలన్నారు. ఇండ్లు లేని వారికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేశ్, నాయకులు బచ్చలకూర సురేశ్, పూసం రాజ్‌కుమార్, లింగన్న, ఉపేందర్, వెంకన్న, వీరభద్రం పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wardens (Female)-4, Telecallers-2, Attractive Salary for deserved candidates. Contact: SUVIDYAA Jr. College, for girls, Nakkalagutta, HNK, Cont: 8885599155, 8885599166, NTW-323235

CHANGE OF NAME

★I, SADANANDAM MIYYAPURAM, R/o. 2-50, Tekumatla, Jayashankar Bhupalpally-506 356, T.S. Changed My Name as SADANANDAM MIYAPURAM, S/o. Miyapuram Shankaraiah. NT-328970

★I, HARISH KUMAR MIYYAPURAM, R/o. 2-50, Tekumatla, Jayashankar Bhupalpally-506 356, T.S. Changed My Name as MIYAPURAM HARISH KUMAR, S/o. Sadanandam Miyapuram. NT-328970

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

తాగునీటి ఎద్దడిలేకుండా చర్యలు

తొర్రూరు, ఏప్రిల్ 8 : తాగునీటి ఎద్దడిలేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పీ శాంతి కుమార్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పురపాలక ఆధ్వర్యంలో కల్పిస్తున్న సౌకర్యాలు, పౌర సేవలు, సాగునీటి వంటి తదితర అంశాలపై చర్చిస్తున్నామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డుల్లో నీటి సమస్య ఉంటే సిబ్బందికి ఫోన్ చేయాలన్నారు. కుమార్ వాటర్ మెన్ 9381104066, మహేందర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ 9573955919, నవీన్ కుమార్ వార్డ్ ఆఫీసర్, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి 8143155958, రంజిత్ కుమార్ మున్సిపల్ ఏఈ ఫోన్ నంబర్ 9347945697ను సంప్రదించాలని తెలిపారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి

తొర్రూరు, ఏప్రిల్ 8 : బ్రాహ్మణ సామాజికవర్గం సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని 'బోప్వా' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ తెలిపారు. బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన ఉగాది పంచాంగాన్ని సోమవారం డివిజన్ కేంద్రంలో సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బోప్వా జిల్లా అధ్యక్షుడు అన్నావజ్జుల రాంబాబు, బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఓలేటి లక్ష్మణాచార్యులు, చైతన్యశర్మ, శివ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

తొర్రూరు, ఏప్రిల్ 9 : రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని తొర్రూరులోని శ్రీనివాస గార్డెన్‌లో సోమవారం రాత్రి తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాలకు చెందిన ముస్లింలకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. మత సామరస్యానికి ప్రతిక రంజాన్ అని అన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆరుగురి అరెస్టు

వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు, డీఎంహెచ్‌వో కళావతి

వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు, డీఎంహెచ్‌వో కళావతిబాయి

మహబూబాబాద్, ఏప్రిల్ 8 : లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. డీఎస్పీ కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి వచ్చిన వైద్యులు ఇద్దరు ఆర్ఎంపీల సహాయంతో కురవి మండలం పిల్లిగుండ్ల తండాలోని భూక్యా శివ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు జరుపుతున్నట్లు కురవి ఎస్సై గోపికి సమాచారం అందింది. వెంటనే ఆయన విషయాన్ని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, డీఎంహెచ్‌వో కళావతిబాయి, కురవి మండలం ప్రభుత్వ వైద్యురాలు స్రవంతికి తెలియజేశాడు. ఎస్పీ ఆదేశాలతో ఇటు పోలీసులు అటు వైద్యులు మూకుమ్మడిగా లింగనిర్ధారణ చేస్తున్న పల్లిగుండ్లతండాలోని ఇంటిపై దాడులు చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన సంపెట అశోక్(టెక్నీషియన్), ప్రైవేట్ హాస్పిటల్ మేనేజర్ పులి వీరభద్రం, కేసముద్రం మండలం అన్నారం గ్రామానికి మరో టెక్నీషియన్ పిట్టల మహేందర్, పిల్లిగుండ్లతండాకు చెందిన భూక్యా శివను అరెస్టు చేశారు. వారి నుంచి లింగనిర్ధారణ చేసే స్కానింగ్ మిషన్, 4 సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ధరావత్ విక్రమ్, కురవి మండలం తిర్మలాపురం గ్రామానికి చెందిన కత్తి యుగేంధర్ తప్పించుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. వీరంతా ముఠాగా ఏర్పడి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, చాకచక్యంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠాను పట్టుకున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై గోపిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

తొర్రూరు చెరువు పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 8: తొర్రూరు పెద్ద చెరువు కట్టకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయించేలా అధికారులు చొరవ తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి సూచించారు. పనులకు సంబంధించిన ఏర్పాట్లను నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కౌన్సిలర్లు, కాంట్రాక్టర్‌తో సమీక్ష చేశారు. టీఎఫ్‌ఐడీసీ ద్వారా రూ.3.5 కోట్ల నిధులు చెరువు కట్ట సుందరీకరణ, బ్రిడ్జి నిర్మాణం కోసం మంజూరై ఉండగా, గతంలో కొంత మేర పనులు ప్రారంభమై వివిధ కారణాలతో నిలిచిపోయిన తీరుపై ఆరా తీశారు. అధికారులు సమన్వయంతో పని చేసి పనులను వేగవంతం చేయాలన్నారు. వచ్చే బతుకమ్మ నాటికి పనులన్నీ పూర్తయ్యేలా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కర్నె నాగజ్యోతి, భూసాని రాము, నర్కూటి గజానంద్, కొలుపుల శంకర్, ప్రజాప్రతినిధులు, నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, హనుమాండ్ల తిరుపతిరెడ్డి, పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, ధరావత్ సోమన్న పాల్గొన్నారు.

వైద్య సేవలను నిర్లక్ష్యం చేయొద్దు

పీహెచ్‌సీ డాక్టర్ తీరుపై ఎంపీపీ ఆగ్రహం

మాట్లాడుతున్న ఎంపీపీ ఉమా

దంతాలపల్లి, ఏప్రిల్ 8: ప్రభుత్వ దవాఖానలో రోగులకు అందించే వైద్యసేవలను వైద్యులు నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ వొలాద్రి ఉమామల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను సోమవారం ఎంపీడీవోతో కలిసి తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సభకు డాక్టర్ రాకుండా సిబ్బందితో మాట్లాడుకుంటూ దవాఖానలో కూర్చున్నట్లు గమనించిన వారు డాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సభకు రాకపోవడంతోపాటు అడిగిన దానికి సరైన సమాధానం చెప్పకపోవడంతో డాక్టర్ చైతన్యపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దవాఖానకు సంబంధించి, అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఏడాది కాలంగా ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. దవాఖానకు సంబంధించిన రిజిస్టర్లను ఎంపీడీవో అడగగా తన వద్ద లేవని, సీనియర్ అసిస్టెంట్ దగ్గర ఉన్నట్లు సమాధానం చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇటు సమావేశాలకు రాకుండా, అటు ప్రజలకు వైద్య సేవలు